పైసా చెల్లించనప్పుడు అవినీతి ఎలా?

ఫార్ములా-ఈ కేసు నన్ను రాజకీయంగా అప్రతిష్ఠపాలు చేసే కుట్ర • ఇది వ్యక్తిగత కక్ష సాధింపు చర్యే

కాకపోతే..నిర్వాహకులను ఎందుకు నిందితులుగా చేర్చలేదు..? • ఏసీబీ కౌంటర్‌కు కేటీఆర్ రిప్లయ్ కౌంటర్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రతిష్ఠకు ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావాలనే మహత్తర సంకల్పంతో ఫార్ములా-ఈ రేస్ నిర్వహించేందుకు ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రిగా చేసిన కృషిని, ఫలితంగా లభించిన ఆర్థిక ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసి, తనపై తప్పుడు కేసు బనాయించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేతారకరామారావు పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయంలో భాగంగా ఫార్ములా-ఈ రేస్ నిర్వహిస్తే, అదేదో తన సొంత నిర్ణయమన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ ద్వారా కేసు నమోదు చేయించిందని మండిపడ్డారు. విధాన నిర్ణయాల్లో లోపాలుంటే అవి ప్రభుత్వం సరిదిద్దుకోవాలని, ఆ నిర్ణయాలను అమలు చేసేటప్పుడు లోటుపాట్లను సరిచేసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదని స్పష్టంచేశారు. తనకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం చెల్లించనప్పుడు, ఎలాంటి లబ్ధి పొందనప్పుడు తాను అవినీతికి పాల్పడినట్టుగా కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. నిజంగానే అవినీతి జరిగిందని ప్రభుత్వం భావిస్తే నిర్వాహకులను ఎందుకు నిందితులుగా చేర్చలేదని నిలదీశారు. ఒప్పందాలన్నీ ప్రభుత్వమే కుదుర్చుకున్నదని, వాటి పత్రాలన్నీ ప్రభుత్వం వద్దనే ఉన్నాయని, సొమ్ము తీసుకున్న నిర్వాహకులు, సొమ్ము చెల్లించిన ప్రభుత్వమూ గట్టు మీద ఉన్నారని, మంత్రి హోదాలో విధానపరమైన నిర్ణయంలో భాగమైనందున తనపై అవినీతిపరుడనే ముద్ర వేసి రాజకీయంగా, వ్యక్తిగతంగా అప్రతిష్ఠపాలు చేయాలనే ప్రభుత్వ కుట్రను అడ్డుకోవాలని కోర్టును కోరారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌లో ఏసీబీ దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌పై కేటీఆర్ 14 పేజీల రిప్లయ్ కౌంటర్ దాఖలు చేశారు. 'ఏసీబీ కేసుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం ద్వారా దర్యాప్తును అడ్డుకోవాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడం సరికాదు. ఎఫ్‌ఐఆర్‌లో ప్రాథమికంగా నేరారోపణలకు ఆధారాలు లేవు కాబట్టే.. హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశాను. నేరాభియోగాలు వెల్లడికాలేదు. కాబట్టే క్వాష్ పిటిషన్ దాఖలు చేశా. రాజకీయ కక్షసాధింపు చర్యలతో దర్యాప్తు సంస్థలను వాడుకోవడం దారుణం. ఈ ప్రక్రియను కోర్టు ద్వారానే అడ్డుకునే హక్కు నాకు ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఫీజు 3 వాయిదాల్లో చెల్లింపునకు అంగీకారం

'ఆర్థికపరమైన ప్రభావాలను అంచనా వేయకుండా, ఆలోచించకుండా ప్రభుత్వం స్పాన్సర్‌షిప్ పాత్రను భరించింది అనడం సరికాదు. 9 నుంచి 12వ సీజన్ వరకు 2023 మే 5లోగా స్పాన్సర్ చెల్లించాల్సిన 10వ సీజన్ ఫీజుపై ఎఫ్‌ఈవో రాసిన లేఖపై ప్రభుత్వం స్పందించలేదు. ప్రపంచవ్యాప్తంగా పోటీలను 2023 జూన్ 20 నుంచి నిర్వహించడానికి షెడ్యూలు ఖరారు చేయడంతో ఎఫ్‌ఈవోతో ప్రభుత్వం సంప్రదించింది. 10వ సీజన్ పోటీలను నిర్వహించడానికి అంగీకరించింది. ఫీజు మొత్తాన్ని 3 వాయిదాల్లో చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. మొదటి విడత 25% 2023 సెప్టెంబర్ 26న, మరో 25% అక్టోబర్ 4లోగా, మిగిలిన 50% అక్టోబర్ 31లోగా చెల్లించాలి. నాటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ హెచ్‌ఎండీఏ కమిషనర్ హోదాలో పురపాలకశాఖ మంత్రి ఆమోదం కోసం ఫైల్ నాకు పంపారు. 10వ సీజన్ నిర్వహణకు మొత్తం రూ.160 కోట్లు అనుమతించాలని ఫైల్‌లో ఉన్నది. మొదటి విడత చెల్లింపుల నిమిత్తం నేను ఆమోదం తెలిపాను' అని కేటీఆర్ రిప్లయ్‌లో వివరించారు. 'పన్నుకు సంబంధించిన అంశం పాత ఒప్పందంలోనే ఉన్నది. అందువల్ల అదనంగా భారం పడిందని చెప్పడం వాస్తవం కాదు. ఫెడరేషన్ ఆఫ్ మోటర్ స్పోర్ట్స్ క్లబ్ ఫీజు వాపసు తీసుకోవాలంటూ రాసిన లేఖపై ప్రభుత్వం స్పందించలేదు. రూ.10 కోట్లకు మించిన చెల్లింపులకు ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని హెచ్‌ఎండీఏ రూల్స్‌లో ఎక్కడా లేదు. ప్రమోటర్ వాటాను ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరంలేదన్న వాదనలోనూ వాస్తవంలేదు. 2023 సెప్టెంబర్ 27న జరిగిన ముసాయిదా ఒప్పందం ప్రకారం హెచ్‌ఎండీఏ ప్రమోటర్‌గా ఉన్నది. పదో సీజన్ తప్పిపోకుండా ఉండేందుకు వాయిదాల ప్రకారం చెల్లింపుల నిమిత్తమే ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది' అని కేటీఆర్ వివరించారు. వచ్చే మూడేండ్లకు రూ.600 కోట్లు చెల్లించాలన్న ఏసీబీ వాదన అవాస్తవమని, ఎలాంటి అంచనా లేకుండా ఖర్చును పెంచి చూపిందని పేర్కొన్నారు.

ఏసీబీ కేసును కొట్టేయండి

'ఫార్ములా-ఈ రేసింగ్ ఒప్పందంలో అక్రమాలు జరిగాయంటూ ఏసీబీ దాఖలు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయండి. కేసు నమోదు చేయడం వెనుక రాజకీయ కక్షసాధింపు ఉన్నది. వ్యక్తిగత కక్షసాధింపులు కూడా ఉన్నాయి. కేసు నమోదుకు ఎలాంటి కారణాలు లేవు. ఎఫ్‌ఐఆర్‌ను పరిశీలిస్తే, అవినీతి జరిగినట్టు ఎక్కడా ఆధారాలు కనబడవు. ఫార్ములా-ఈ రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో), ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. సీజన్ 9లో రూ.110 కోట్ల లాభం వచ్చింది. ప్రభుత్వం, ఆర్గనైజర్, హెచ్‌ఎండీఏ మధ్య 2022 అక్టోబర్ 25న మధ్య ఒప్పందం కుదిరింది. తొలి ఏడాది ఫార్ములా కార్ రేసింగ్ నిర్వహిస్తే రూ.110 కోట్లు లాభం వచ్చింది. ప్రభుత్వమే ఒప్పందం చేసుకున్నది. అవినీతి నిరోధక చట్టం 1988లోని సెక్షన్ 13(2), ఐపీసీ 409, 120-బీ సెక్షన్ల కింద కేసు నమోదు చెల్లదు' అని కేటీఆర్ వివరించారు.

ఆర్బిట్రేషన్ క్లాజ్ ఉంది

'పదవ సీజన్‌కు ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు ఆమోదం చెప్పింది. 2023కు చెందిన బకాయిలను చెల్లించింది. కొత్తగా చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో అర్బిట్రేషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒప్పందంలో ఆర్బిట్రేషన్ క్లాజ్ ఉన్నది. ఇప్పటికే ఉన్న ఒప్పందాన్ని అమలు చేయడానికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తించదు. ఈసీ ప్రొసీజర్ అమలు చేయలేదన్న ఆరోపణ మీద 14 నెలలకు ప్రభుత్వం ఆలస్యంగా కేసు నమోదు చేయడం చెల్లదు. తీవ్ర జాప్యానికి కారణాలు కూడా పేర్కొనలేదు. లలితకుమారి, చరణ్‌సింగ్ కేసుల్లో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు ఇది వ్యతిరేకం. సుప్రీంకోర్టు మూడు నెలల జాప్యానికే అనుమతించలేదు. ఈ కేసులో ఏకంగా 14 నెలలు జాప్యం జరిగింది' అని కేటీఆర్ వెల్లడించారు.

ఒక్క రూపాయి కూడా నాకు చెల్లించలేదు

'ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ఒక్క ఆరోపణ కూడా లేదు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 3(1)(ఎ) కింద కేసు నమోదు చేయడానికి దుర్వినియోగం ఎక్కడ జరిగిందో పేర్కొనలేదు. పిటిషనర్ సొంతానికి నిధులు ఇవ్వలేదు. పిటిషనర్‌కు చెల్లింపులు లేనప్పుడు అవినీతి జరిగిందని ఎలా కేసు నమోదు చేస్తారు. అభియోగాల మేరకు అవినీతి జరిగిందని భావిస్తే.. లబ్ధిదారులైన ప్రమోటర్స్‌పై కేసు ఎందుకు నమోదు చేయలేదు. స్పాన్సర్స్ వెళ్లిపోవడంతో ఒప్పందంలో పార్టీగా ఉన్న ప్రభుత్వం దానిని కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నది. ఆ నిర్ణయమే లోపమైతే ప్రభుత్వమే తన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలి. ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నది ప్రభుత్వమే. ఆనాటి మంత్రిగా ఆమోదం చెప్పడం జరిగింది. పీసీ యాక్ట్ సెక్షన్ 13(2) కింద కేసు నమోదుకు ఆస్కారం లేదు. నేరపూరిత ప్రవర్తన ఎక్కడ ఉన్నది? ఐపీసీ 409 కింద ఏ ఒక్క ఆధారమూ చూపలేదు' అని కేటీఆర్ వివరణ ఇచ్చారు.

విధాన నిర్ణయాల్లో లోపాలుంటే..

'అగ్రిమెంట్‌లో లోటుపాట్లు ఉంటే అది ప్రభుత్వ పరమైనదే అవుతుంది. రెండోసారి ఒప్పందం చేసుకున్నప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్టు ప్రభుత్వం చెప్పడం ఆశ్చర్యకరం. తొలి ఒప్పందం మేరకే రెండోది జరిగింది. ఫార్ములా-ఈ నిర్వహించేందుకు తేదీలు కూడా ఖరారు అయ్యాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలు వర్తించవు. తీవ్ర జాప్యంతో అంటే 14 నెలలకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం చట్ట వ్యతిరేకం. ప్రాథమిక విచారణ కూడా లేకుండా ఎఫ్‌ఐఆర్ నమోదైంది. కేవలం ప్రత్యర్థి పార్టీ నేతగా ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్నందునే కేసు నమోదు చేశారు. పీసీ యాక్ట్‌లోని 13(1)ఏ ప్రకారం చట్టసభ ప్రతినిధి నిధుల దుర్వినియోగం అభియోగాలు ఉంటేనే కేసు నమోదు చేయాలి. స్పాన్సర్లు వెళ్లిపోయారని చెప్పి ప్రభుత్వం.. నిర్వాహకులు కూడా వెళ్లిపోయేలా చేసింది. ఇక్కడ డబ్బులు తీసుకున్న నిర్వాహకులపై కేసు పెట్టకుండా నాటి మున్సిపల్ శాఖ మంత్రిగా చేసిన నాపై లేని అవినీతి గురించి కేసు నమోదు చేయడం దారుణం. అభియోగాలకు ఆధారాలు ఐపీసీ 409 సెక్షన్ కూడా వర్తించదు' అని కేటీఆర్ అన్నారు.

చెల్లింపులు చేశాక ప్రభుత్వానికే నష్టం

'గతేడాది సెప్టెంబర్ 25న సీజన్ టెన్ ప్రమోటర్స్ ఫీజుగా 2 విడతలుగా 22.5 లక్షల పౌండ్లు (జీబీపీ) చొప్పున ప్రభుత్వం చెల్లింపులు చేశాక (భారత కరెన్సీ ధరల ప్రకారం తొలి విడత రూ.23,69,63,125, రెండో విడత పౌండ్ విలువ మారిన కారణంగా రూ.23,01,97,500 చొప్పున) ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ హిమాయత్‌నగర్ బ్రాంచ్ ద్వారా యూకేలోని ఫార్ములా-ఈ సంస్థకు చెల్లింపులు చేశాక మూడో విడత చేయకపోవడంతో సీజన్ 10 ఆగిపోయింది. అగ్రిమెంట్ ప్రకారం సీజన్ 10 ఫార్ములా ఈ ఏడాది ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరగాలి. అయితే 25% చొప్పున (26 సెప్టెంబర్, 4 అక్టోబర్-2023) 2 వాయిదాలు అంటే 50% సొమ్ము చెల్లించిన ప్రభుత్వం ఆఖరి విడత సొమ్ము చెల్లించకపోవడంతో సీజన్ 10 ఈవెంట్ జరగలేదు. ఫార్ములా-ఈ లీగల్ డైరెక్టర్ గత ఏడాది డిసెంబర్ 23న రాసిన లేఖలో గత డిసెంబర్ 26లోగా మిగిలిన 50% చెల్లిస్తే సీజన్ 10 నిర్వహిస్తామని చెప్పినా ప్రభుత్వం చేయలేదు. గత ఏడాది డిసెంబర్ 19న కూడా మరో లేఖ కూడా రాసినప్పటికీ ప్రభుత్వంలో కదలిక రాలేదు. ఈ లేఖల ప్రకారం ఫార్ములా-ఈ ఆపరేషన్లకు 50% మొత్తాన్ని ప్రభుత్వం చెల్లింపుల్లో వైఫల్యం కారణంగా ముందుగా చేసిన 50% చెల్లింపులు వృథా అయ్యాయి. రెండు విడతలు చెల్లించిన తర్వాత కూడా నిర్వహించలేకపోయింది. ఫార్ములా-ఇ చాంపియన్ షిప్ అనేది ప్రపంచంలోని ప్రీమియర్ ఎలక్ట్రిక్ కార్ స్ట్రీట్ రేసింగ్ సిరీస్. ఇది 2014లో అత్యాధునిక సాంకేతికతతో ప్రారంభమైంది. థ్రిల్లింగ్ మోటర్ స్పోర్ట్ చర్యను మిళితం చేస్తుంది. క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడానికి, ఎలక్ట్రిక్ వాహనాల వాడకానికి దోహదం చేస్తుంది' అని కేటీఆర్ రిప్లయ్ కౌంటర్‌లో తెలిపారు.

కుట్ర, రాజకీయ కక్షతోనే కేసు

'అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్ 13(1)(ఏ), సెక్షన్ 13(2) శిక్షార్హమైనవి ఈ కేసులో నాకు వర్తించవు. ఐపీసీలోని 120-బీ, 409 సెక్షన్ల కింద కేసు నమోదు వెనుక కుట్ర ఉన్నది. ఇలాంటి తీవ్ర నేరాభియోగాలతో కేసు నమోదు చేస్తే 41 (ఏ) నోటీసు ఇచ్చి పిటిషనర్‌ను విచారణ చేయాల్సిన అవసరం లేకుండా చేయాలనే కుట్ర దాగి ఉన్నది. వేధింపులు, రాజకీయ కుట్రతో జైలుకు పంపాలనే కుయుక్తి గూడుకట్టుకుని ఉన్నది. అగ్రిమెంట్స్ జరిగినట్టుగా, అదీ ప్రభుత్వ ఆధీనంలో జరిగినట్టుగా పత్రాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా తనను లక్ష్యం చేసుకుని ప్రభుత్వం కేసు బనాయించింది' అని కేటీఆర్ 14 పేజీల రిప్లయ్ కౌంటర్‌లో పేర్కొన్నారు.

నిర్వాహకులను నిందితులుగా ఎందుకు చేర్చలేదు?

'సీజన్-9 ఫిబ్రవరి 2023లో హైదరాబాద్‌లో జరిగినప్పుడు దేశ, విదేశాలకు చెందిన 35 వేల మంది వీక్షించారు. ఇ-ప్రిక్స్‌కు అంతర్జాతీయ సందర్శకులు కూడా హాజరయ్యారు. హోర్డింగ్స్, హాస్పటాలిటీస్, అడ్వర్టైజింగ్, టూరిజం ఇతర లావాదేవీల ద్వారా రాష్ట్రానికి రూ.700 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. భారత దేశంలో ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహించిన ఏకైక నగరంగా హైదరాబాద్ నిలిచింది. ఇప్పటివరకు న్యూయార్క్, లండన్, ప్యారిస్, బెర్లిన్, బీజింగ్, సియోల్ వంటి నగరాల్లో జరిగింది. ఈవెంట్ నిర్వహణ వల్ల రాష్ట్రానికి చేకూరిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వదిలేసి రాజకీయ కక్షతో తప్పుడు కేసు బనాయించింది. కుట్ర పన్నారనేదే నిజమని భావిస్తే ప్రభుత్వం ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వాహకులను నిందితులుగా ఎందుకు చేర్చలేదు? ఈ ఒక్క కోణం నుంచి చూస్తే కేసు కుట్రపూరితమని అర్థం అవుతున్నది. ప్రమోటర్ నిందితుడు కానప్పుడు ఐపీసీ 120బీ కింద కుట్ర జరిగిందని ఆరోపణ చేయడం చెల్లదు. ఇది పూర్తిగా సివిల్ వివాదం అవుతుంది' అని కేటీఆర్ తెలిపారు.

కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

- గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు
- తదుపరి విచారణ 31కి వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించి ఏసీబీ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ నెల 31 వరకు అరెస్టు చేయవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. గత విచారణ సందర్భంగా జారీ చేసిన ఉత్తర్వులను పొడిగించింది. కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న ఉత్తర్వులను ఎత్తివేయాలని ఏసీబీ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. వాదనలు వినకుండా ఉత్తర్వులను జారీ చేయలేమని తేల్చిచెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ-కార్ రేసుపై ఈ నెల 19న ఏసీబీ నమోదు చేసిన కేసును కేటీఆర్ హైకోర్టులో సవాలు చేశారు. ఆ కేసును కొట్టేయాలని కోరుతూ కేటీఆర్ ఈ నెల 20న హైకోర్టులో లంచ్ మోషన్ రూపం లో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జరిగిన విచారణలో కేటీఆర్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. రాజకీయ కుట్రతో అన్యాయంగా ఈ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని కోరారు.

ఏసీబీ కౌంటర్

అనంతరం కేటీఆర్ పిటిషన్‌పై ఏసీబీ తరపున డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ కౌంటర్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్‌ఐఆర్‌లోని పలు అంశాలను పునఃప్రస్తావించారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నదని, ఇలాంటి తరుణంలో కోర్టు జోక్యం చేసుకొని నిందితులకు ఊరట కలిగేలా ఉత్తర్వులివ్వడం సరికాదని తెలిపారు. ఇలాంటి విషయాల్లో కోర్టులకు పరిమిత అధికారాలు మాత్రమే ఉంటాయని పేర్కొంటూ.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకించారు. ఈ వాదన అనంతరం ఏసీబీ విజ్ఞప్తిని తోసిపుచ్చిన హైకోర్టు.. కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

భూమి తనఖా పెట్టి పది వేల కోట్లు

- రేవంత్ సర్కార్ మరో భారీ అప్పు
- 1.37 లక్షల కోట్ల రూపాయలకు చేరిన కాంగ్రెస్ సర్కారు అప్పు
- ఒక్క ఆర్బీఐ నుంచే 55,618 కోట్లు
- ప్రభుత్వ గ్యారెంటీ కింద 61,991 కోట్లు
- గ్యారెంటీయేతర రుణాలు 10,099 కోట్లు
- 31న ఆర్బీఐ నుంచి మరో 409 కోట్లు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి భారీ మొత్తంలో అప్పు చేసింది. ఈ సారి ఏకంగా భూములను తనఖా పెట్టి మరీ రూ.పది వేల కోట్లు అప్పు చేసింది. 400 ఎకరాల భూమిని తనఖా పెట్టి ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఐసీఐసీఐ బ్యాంకు నుంచి టీజీఐఐసీ ద్వారా ఈ అప్పు చేసింది. రేవంత్‌రెడ్డి సర్కారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శుక్రవారం వరకు రూ.1.37 లక్షల కోట్లు అప్పుచేసింది. ఇదే పద్ధతిలో అప్పులు కొనసాగిస్తే కాంగ్రెస్ ఐదేండ్ల పాలన పూర్తయ్యేనాటికి తెలంగాణ రాష్ట్ర అప్పు రూ.6.85 లక్షల కోట్లకు చేరనున్నది. 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ 30 వరకు కేంద్రం విధించే రుణ పరిమితి (ఎఫ్‌ఆర్‌బీఎం) మేరకు ఆర్బీఐ నుంచి రూ.52,118 కోట్లు అప్పు తీసుకున్నట్టు ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆ తర్వాత డిసెంబర్ 3న రూ.2,000 కోట్లు, డిసెంబర్ 17న మరో రూ.1,500 కోట్లు రుణం పొందారు. డిసెంబర్ 31న మరో రూ.409 కోట్లు తీసుకొనేందుకు ఆర్బీఐ నిర్వహించే వేలంలో పాల్గొన్నారు. వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం గ్యారెంటీగా ఉంటూ రూ.61,991 కోట్లు పొందారు. ఎలాంటి గ్యారెంటీ లేకుండా తీసుకున్న రుణాలు రూ.10,099 కోట్లు ఉన్నట్టు అసెంబ్లీ వేదికగా ఆర్థిక మంత్రి భట్టి చెప్పారు.

6.5 లక్షల కోట్లు ఎలా తీర్చాలి

ఐసీఐసీఐ బ్యాంకు నుంచి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా తెలంగాణ సర్కారు తాజా గా రూ.10 వేల కోట్లు రుణం పొందింది. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ప్రభుత్వం బదిలీచేసింది. పదేండ్లలో వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని షరతులతో టీజీఐఐసీ రుణం తీసుకున్నది. తాజాగా వచ్చిన రూ.10 వేల కోట్లను రైతు భరోసాతోపాటు ఇతర పథకాలకు వినియోగించాలని సర్కారు యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కాలేదు.. ఒక్క ప్రాజెక్టుకు ఇటుక పేర్చిందీ లేదు.. కొత్తగా ఒక్క వినూత్న పథకం ప్రారంభించిందీ లేదు.. అయినా ఏడాది కాలంలోనే సుమారు లక్షన్నర కోట్ల అప్పుల భారం తెలంగాణ ప్రజలపై మోపడంపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రూ.4,17,496 కోట్ల అప్పు తెచ్చి కాళేశ్వరం, సచివాలయం వంటి అనేక భారీ ప్రాజెక్టులు నిర్మిస్తే గాయి గాయి చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో అప్పులు చేయడం ఏమిటని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఐదేండ్లలోనే సుమారు ఆరున్నర లక్షల కోట్ల అప్పు చేస్తే వచ్చే ప్రభుత్వం ఎలా తీరుస్తుందని నిలదీస్తున్నారు.

ఈ ఏడాది అప్పుల చిట్టా..

- 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ 17 వరకు ఆర్బీఐ నుంచి డ్రా చేసిన ఎఫ్‌ఆర్‌బీఎం రుణాలు రూ.55,618
- 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ 30 వరకు కార్పొరేషన్లు/ ఎస్‌పీవీలు డ్రా చేసిన ఎఫ్‌ఆర్‌బీఎం యేతర రుణాలు రూ.61,991 కోట్లు
- 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ 30 వరకు గ్యారెంటీ లేకుండా తీసుకున్న రుణాలు రూ.10,099 కోట్లు
- 400 ఎకరాలు తనఖా పెట్టి ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఐసీఐసీఐ నుంచి టీజీఐఐసీ ద్వారా ప్రభుత్వం తీసుకున్న రుణం రూ.10 వేల కోట్లు.

అజర్‌బైజాన్ ప్రమాదం వెనుక విదేశీ శక్తులు!

బాకు, డిసెంబర్ 27: ఈ నెల 25న కూలిపోయిన అజర్‌బైజార్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాదం వెనుక విదేశీ శక్తులు ఉండొచ్చని ఆ దేశ అధికారులు భావిస్తున్నారు. విదేశీ భౌతిక, సాంకేతిక శక్తుల కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నట్టు సమాచారం. ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతున్నదని ప్రభుత్వ అనుకూల వెబ్‌సైట్ కాలిబర్ శుక్రవారం ఒక కథనాన్ని ప్రచురించింది. ఘటనా స్థలిలో విమానం ముందు భాగం దెబ్బ తినడాన్ని గమనిస్తే అది క్షిపణి దాడికి గురైనట్టు అనిపిస్తున్నదని సైన్య, విమానయాన నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రమాదం నుంచి బయటపడిన ఓ ప్రయాణికుడు మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో పెద్ద చప్పుడు వచ్చిందని. ఆ తర్వాత విమానం మద్యం తాగి ఊగినట్టు ప్రవర్తించిందని.. అది తామెక్కిన విమానమేనా, కాదా అన్న అనుమానం వచ్చినట్టు ప్రవర్తించిందని తెలిపాడు. మరో వైపు తమ దేశ క్షిపణి దాడి వల్లే విమానం కుప్పకూలిందన్న వార్తలను రష్యా ఖండించింది.

సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు మల్లవ్వ, ఆమె భర్త రాజనర్సు

వృద్ధురాలిని గెంటేసిన సర్కారు దవాఖాన!

- *భర్తకు అండగా ఉన్న భార్య.. హైబీపీతో అనారోగ్యం*
- *వీల్‌చైర్‌పై తీసుకొచ్చి రోడ్డుపై వదిలేసి సిబ్బంది*
- *జగిత్యాల జిల్లా కేంద్రంలో అమానుషం*

జగిత్యాల, డిసెంబర్ 27 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో హృదయ విదారకరమైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన రాజనర్సు అనారోగ్యానికి గురి కావడంతో వారం రోజుల క్రితం అతని భార్య మల్లవ్వ జగిత్యాలలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చింది. రెండు రోజులుగా హైబీపీతో బాధ పడుతున్న మల్లవ్వ కూడా సొమ్మసిల్లి పడిపోయింది. తన భర్తకు అలాట్ చేసిన బెడ్‌పై ఉన్న మల్లవ్వను గమనించిన దవాఖాన సిబ్బంది ఆమెను వీల్‌చైర్‌పై బయటకు తీసుకొచ్చి రోడ్డు పక్కన దింపి వెళ్లిపోయారు. విషయాన్ని గమనించిన రాజనర్సు రోడ్డు పక్కన పడుకుని ఉన్న తన భార్య వద్దకు చేరుకున్నాడు. మల్లవ్వతో పాటు ఉన్న రాజనర్సును గమనించిన స్థానికులు జగిత్యాల టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మల్లవ్వ, రాజనర్సును దవాఖానకు తరలించారు. ప్రభుత్వ దవాఖానలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణంగా మారిపోయాయన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ, ఓ వృద్ధుడిని పాత్ బస్‌స్టేషన్‌లో దింపి పోగా స్థానికులు గమనించి ఆగ్రహం వ్యక్తం చేయడంతో తిరిగి దవాఖానకు తరలించారు. ఓ గర్భిణి కడుపులో వస్త్రాలు మరిచిపోయిన ఘటన కూడా వెలుగులోకి రావడం అప్పట్లో సంచలనంగా మారింది. తాజాగా భర్తకు అటెండెంట్‌గా ఉన్న మల్లవ్వ విషయంలోనూ దవాఖాన సిబ్బంది కఠినంగా వ్యవహరించిన తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఆర్టీసీలో త్రిసభ్య కమిటీ రచ్చ?

- కమిటీ సమావేశమెప్పుడో.. సమస్యలు పరిష్కారమయ్యేదెన్నడో?
- తీవ్ర అసంతృప్తిలో ఆర్టీసీ కార్మికులు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తేతెలంగాణ) : ఆర్టీసీలో సర్వీస్ రిమూవల్ అయిన కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ కార్మికుల్లో రచ్చ లేపింది. కమిటీలో తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇద్దరు ఐఏఎస్‌లు, ఒక ఐపీఎస్‌తో ఏర్పాటుచేసిన కమిటీతో తమకు ఏం న్యాయం జరుగుతుందని కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ గుర్తింపు లేకపోవడంతో యూనియన్లకు బస్‌భవన్‌లోకి ఎంట్రీ లేదని, తమ సమస్యలు పరిష్కారం కావట్లేదని వాపోతున్నారు. త్రిసభ్య కమిటీ ఏర్పాటై 15 రోజులు అవుతున్నా.. ఇప్పటికీ కార్మికుల సర్వీస్ వివాదాలపై ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిటీలో సంఘాలకు అవకాశం ఏది?

ఆర్టీసీలో చివరిసారిగా 2016లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) గెలుపొందగా, రెండేండ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత మళ్లీ ఎన్నికలు జరగలేదు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక ట్రేడ్ యూనియన్‌కు గుర్తింపు వస్తుందని భావించినా అది నెరవేరలేదు. ఈక్రమంలో వివిధ కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించబడిన కార్మికులు తమకు తిరిగి ఉద్యోగం ఇవ్వాలని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతుండటంతో.. సమస్య పరిష్కారానికి కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్ చైర్మన్‌గా త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేస్తూ సర్కారు డిసెంబర్ 11న జీవో తీసుకొచ్చింది. ఈ కమిటీలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సెర్ప్ సీఈవో దివ్య సభ్యులుగా ఉన్నారు. యూనియన్ల నుంచి మాత్రం అవకాశం ఇవ్వలేదు.

కార్మికుల పొట్ట కొడుతున్నరు..

యాక్సిడెంట్లు, టికెట్ల జారీలో పొరపాట్లు, బ్రీత్ అనలైజర్ కేసుల్లో దాదాపు 300 మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో చిన్న చిన్న తప్పులకే ఉద్యోగాల నుంచి తొలగించి తమ పొట్ట కొడుతున్నారని కార్మికులు వాపోతున్నారు. తమకు తిరిగి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. త్రిసభ్య కమిటీలో యూనియన్ల నుంచి అవకాశం కల్పించాలని జాక్ కన్వీనర్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. కార్మికులపై వేధింపులు పెరిగాయని, ఎక్కువ గంటలు పని చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సీసీఐ పత్తి కొనడంలేదని రైతుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి...

పెట్టి మద్దతు ధర ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, రైతులు పండించిన పత్తిని వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు రోజుల నుంచి నిరీక్షిస్తున్న

నాగిళ్ల గ్రామ పంచాయతీలోని కొర్ర తండా నుంచి నాలుగు రోజుల క్రితం పత్తి అమ్మడానికి తీసుకువచ్చాను. సీసీఐ అధికారులు రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకుండా దళారులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేస్తూ మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దళారులు తెచ్చిన పత్తికి మద్దతు ధర ఇచ్చిన రైతులు తెచ్చిన పత్తికి మాత్రం మద్దతు ధర ఇవ్వడం లేదు.

-బాలూ నాయక్, కొర్ర తండా

చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

పత్తికి మద్దతు ధర ఇవ్వాలని రైతుల ధర్నా

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట సమీపంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పత్తికి మద్దతు ధర చెల్లించాలని కోరుతూ శుక్రవారం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. మంగళవారం వరకు పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7520 ఉండగా, ప్రస్తుతం క్వింటాలుకు రూ.100 తగ్గించారని, తగ్గించిన రూ.100 పెంచాలని డిమాండ్ చేశారు. చెన్నూర్ సీఐ రవీందర్, సీపీవో రైతులతో మాట్లాడి నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు.

పత్తిని వెంటనే కొనుగోలు చేయాలి

మేము పత్తి అమ్మడానికి ఆకుతోటపల్లి సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాం. సీసీఐ అధికారులు మాత్రం నామమాత్రంగా ఇద్దరు ముగ్గురు రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసి దళారులు తెచ్చిన పత్తిని మొత్తం కొనుగోలు చేస్తూన్నారు. దళారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై రైతుల పత్తి కొనుగోలు చేయకుండా మద్దతు ధర ఇవ్వకుండా నట్టేట ముంచుతున్నారు.

- కొర్ర మధ్యనాయక్

నల్లబెల్లి మండలంలో పులి సంచారం

- పాదముద్రలు నిర్ధారించిన అటవీ అధికారులు

నల్లబెల్లి, డిసెంబర్ 27: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం పరిసరాల్లో పులి కదలికలు కనిపించాయి. పొలాల్లో పాదముద్రలు గుర్తించిన ప్రజలు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్న ఎఫ్ఆర్వో రవికిరణ్ వాటిని పులి పాదముద్రలుగా నిర్ధారించారు. కొండాపూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి మేడెపల్లి, ఆసరవెల్లి, గొల్లపల్లె, రాంపూర్ గ్రామాల మీదుగా రుద్రగూడెం 365 జాతీయ రహదారిని దాటుకుని గురువారం రాత్రి పంట పొలాల్లో పెద్దపులి సంచరించింది. దాని పాదముద్రలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతోపాటు రైతులు ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకుని పెద్దపులి పాదముద్రలుగా తేల్చారు. పులి సంచరించిన పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో, ఎస్సై గోవర్ధన్ ఈ సందర్భంగా సూచించారు.

కోనాపురం అడవుల్లో సంచారం

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కోనాపురం అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నదని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడ ఫారెస్ట్ రేంజర్ వజాహత్ తెలిపారు. రుద్రగూడెంగ్రామం నుంచి మూడు చెక్కలపల్లి మీదుగా రాత్రి కోనాపురం వైపు వచ్చిందని, ముసలిమడుగు ప్రాంతంలో పాదముద్రలు గుర్తించామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.